



మోడీ పర్యటన నిరసిస్తూ గాంధీ విగ్రహం ఎదుట సిపిఎం నిరసన

ధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నా..

- బాబు రెండో రోజు పర్యటన విజయవంతం
- నామకరణంతో ఆరంభం
- పలు సంస్థలతో ఒప్పందం
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- శ్యామన్న విగ్రహావిష్కరణ



నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సిఎం



అభివృద్ధి పనులను శంకుస్థాపనలు



చిన్నారికి నామకరణం చేసిన ముఖ్యమంత్రి

ప్రజాశక్తి- కుప్పం టౌన్, కుప్పం రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటన మంగళవారం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ పర్యటనలో భాగంగా పట్టణ పరిధిలోని రోడ్డు, భవనాలశాఖ అతిథి గృహంలో శాంతిపురం మండలం తుమ్మిసి గ్రామానికి చెందిన టిడిపి అభిమాని శివ, సత్య దంపతుల కుమారుడికి జితేంద్ర అని నామకరణం చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం టిడిపి కార్యాలయానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జననాయకుడు పేరుతో ప్రజాసమస్యల పరిష్కార వేదికను ప్రారంభించారు. తద్వారా కుప్పం నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను టిడిపి కార్యాలయంలో జననాయకుడు వేదిక ద్వారా తెలియజేయవచ్చని, ఆ సమస్యలను పరిశీలించి, పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు 1090 అర్జీలను జననాయకుడు కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా అర్జీలను తీసుకుంటూ బాధితుల సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. అంతేకాక వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలలో భూ సమస్యలు, ఆరోగ్య సమస్యలు, విద్య వంటి అనేక సమస్యలపై అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. ఆపై పట్టణ పరిధిలోని నందమూరి తారక రామారావు క్రీడా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి, ప్రత్యేకంగా కుప్పం పట్టణ అభివృద్ధికి సంబంధించి పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. స్థానికంగా నిరుద్యోగ నిర్మూలనకై పలు సంస్థలను ప్రారంభించడానికి సైతం శంకుస్థాపనలను చేశారు. శంకుస్థాపనల అనంతరం పలు పరిశ్రమలకు, సంస్థలకు సంబంధించిన ప్రతినిధులతో కడా కుదుర్చుకున్న ఒప్పంద కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని, సంస్థల ప్రతినిధులతో వారు చేపట్టే కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించి, వాటి పనితీరును, వాటి వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను ఆరా తీశారు. ఆపై ప్రజలతో ప్రసంగిస్తూ ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులను, ఈ కార్యక్రమంలో భాగంగా నృత్య కార్యక్రమాలలో పాల్గొన్న చిన్నారులను అభినందించారు. ఆపై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ ప్రజల రుణం ఏనాటికి తీర్చుకోలేనని, కుప్పం సమగ్ర అభివృద్ధితో ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటానన్నారు. ఇందుకోసం స్వర్ణ కుప్పం 2029 ని ఆవిష్కరించినట్టు తెలిపారు. ఈ ఐదు సంవత్సరాలలో కుప్పం నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపుతామన్నారు. చివరగా ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ చేసుకున్న పలువురు బాధితులకు సంబంధించిన పరిహారాన్ని అందజేశారు. అక్కడినుండి కంగుంది గ్రామానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ శ్యామన్న కంగుంది గ్రామ సర్పంచ్ గా, కళాకారుడిగా, ఉత్తమ రైతుగా పేరుందిన ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.

సుపరిపాలన అందించడం కోసమే 'జన నాయకుడు'పోర్టల్

గత ఐదేళ్లలో ధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నానని, ఓట్లేసి గెలిపించిన ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలందరికీ సుపరిపాలన అందించడమే లక్ష్యంగా జన నాయకుడు పోర్టల్‌ను రూపొందించామని, మొదటి కుప్పంలో దీన్ని అమలు చేసి ఆపై రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ అందుబాటులోకి తెస్తామని చెప్పారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ తనను 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజల రుణం తీర్చుకోలేనన్నారు. టిడిపి ఆవిర్భావ అనంతరం కుప్పం నియోజకవర్గంలో మరో పార్టీ జెండా ఎగురలేదని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిజం చేస్తూ రాబోయే ఐదేళ్లలో కుప్పంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా స్వర్ణ కుప్పం విజన్ - 2029కి రూపకల్పన చేసినట్టు తెలిపారు. అలాగే కుప్పం ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయడం కోసం జన నాయకుడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.

వ్యవస్థలను నాశనం చేసి పోయారు..

గత పాలకులు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, అప్పులకుప్పగా రాష్ట్రాన్ని మార్చేశారని ఆరోపించారు. అరాచక పాలనను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధించారని, జైలు పాల్జేశారని, చివరకు మీడియా ప్రతినిధులపైనా కేసులు పెట్టారని, ఒక ఆర్డర్ తెచ్చి మీడియాపై కేసులు ఎత్తివేస్తామని పేర్కొన్నారు. భూముల దస్త్రాలన్నింటినీ తారుమారు చేసిన ఘనులు వైసీపీ నేతలని, భూములను కబ్జా చేసేశారని, రెవెన్యూ సదస్సుల్లో ఆ దస్త్రాలన్నింటినీ సరిదిద్దుతామని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు తీసుకొస్తున్నామని, రాష్ట్రంలో కరువును పారద్రోలి, నీటి భద్రత కల్పించేందుకు గోదావరి, పెన్నా నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువస్తామన్నారు. ఆపై కుప్పంకు నీరు అందిస్తామని తెలిపారు. అలాగే హంద్రీనీవా పనులను జూన్ కల్లా పూర్తిచేసి కృష్ణా జలాలను తీసుకొస్తానని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

రాజకీయాలలో యువతకు ప్రాధాన్యం కల్పించాలి

యువ నాయకుడు గిరిధర్

రాజకీయాలలో యువతకు ప్రాధాన్యం కల్పించాలని శాంతిపురం మండలం కర్లగట్ట గ్రామానికి చెందిన యువనాయకుడు గిరిధర్ కుప్పం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి నాయకుల గెలుపులో యువత పాత్ర ఎంతగానో ఉందని, ముఖ్యంగా బాబు సొంత నియోజకవర్గంలో గత వైసిపి పాలనలో ఎన్నో ఇబ్బందులను, దాడులను ఎదుర్కొని అధికార ప్రభుత్వంపై యువత పోరాటం చేయడం జరిగిందన్నారు. కనుక యువత కష్టాన్ని గుర్తించి పార్టీలో ప్రత్యక్ష రాజకీయాలలో సముచిత స్థానం కల్పించాలని కోరారు.

క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ అందించండి : కన్నన్



కుప్పంలోని క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ అందించాలని కోరుతూ కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో టిడిపి ప్రభుత్వం పట్టణ పరిధిలో సుమారు 14 ఎకరాలకు పైగా ఎన్టీఆర్ క్రీడా సముదాయాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం తిరిగి టిడిపి ప్రభుత్వంలోనే క్రీడా సముదాయ అభివృద్ధికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఎన్టీఆర్ క్రీడా సముదాయానికి చేరుకుని, క్రీడాప్రాంగణ అభివృద్ధికి ప్రత్యేకంగా 22 కోట్ల రూపాయల నిధులను విడుదల చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా కుప్పం ప్రాంతంలోని క్రీడాకారులకు ఉత్తమ శిక్షణను అందించడానికి సైతం ప్రభుత్వం తరపున సహాయ సహకారాల అందించాలని, ముఖ్యంగా క్రికెట్ ఆటపై యువత ఎక్కువ మక్కువ చూపుతున్నట్టు తెలిపారు. దీనిని గుర్తించి ప్రభుత్వం క్రికెట్ ఆటలో ఉత్తమ శిక్షకులను ఏర్పాటుచేసి కుప్పం ప్రాంత క్రీడాకారులకు శిక్షణ అందించాలని కోరారు. తద్వారా కుప్పం నుండి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు వస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

'జన నాయకుడు' సత్ఫలితాలను ఇస్తుంది: ఎంపీ

చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత ఆశయంతో కుప్పంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన జన నాయకుడు కార్యక్రమం సత్ఫలితాలనిస్తుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ప్రజలకు ఉపయోగకారిగా పనిచేస్తుందని అంతేకాకుండా ప్రజాసమస్యల పరిష్కారానికి మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు. కుప్పాన్ని రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన నాయకుడనే మరో ప్రయోగాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని దీన్ని మంగళవారం కుప్పంలోని టీడీపీ కార్యాలయం ప్రాంగణంలో ప్రారంభించారని తెలిపారు.

ఏనుగుల నివారణకు చర్యలు తీసుకోవాలి

సీఎంకు వినతిపత్రం



బంగారుపాళ్యం: పంటలు, మనుషులపై దాడులు చేస్తున్న ఏనుగుల నివారణకు తగిన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం ఇచ్చినట్టు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఉమాపతి నాయుడ తెలిపారు. మంగళవారం కుప్పం నియోజకవర్గంలో ఉన్న ముఖ్యమంత్రిని కలిసి ఏనుగుల నివారణ కోసం చర్యలు తీసుకోవాలని, ఏనుగుల దాడిలో మృతి చెందిన వారికి ఆర్థిక సహాయం, పంట నష్టం 100 శాతం అయితే 10 శాతమే నష్టపరిహారం అందిస్తున్నారని దీన్ని పెంచాలని కోరారు. అలాగే ఏనుగులు గ్రామాల్లోని పంటల పైకి రాకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కాపాడాలని కోరారు. అలాగే ఒంటరి ఏనుగులు నిత్యం మనుషులపై, పశువులపై దాడులు చేసి చంపేస్తున్నాయని వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి రైతులు ఉన్నారు.

ప్రధాని పర్యటనను నిరసించండి

- ఏపీకి హోదా అమలు చేయాలి
- వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయించాలి
- సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, చిత్తూరు టౌన్

విభజన చట్టంలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్వహించి, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, విభజన చట్టంలో ఉన్న అంశాలను అమలు చేయాలని ప్రధాని పర్యటనను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకుండా పది సంవత్సరాలుగా మోసం చేసిన బిజెపి ప్రధాని మోడీ పర్యటనను రాష్ట్ర ప్రజలు నిరసించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కడప ఉక్కు, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేసిన నాయకులు పార్టీలు అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి ఊసే మాట్లాడడం లేదని విమర్శించారు. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు సుమారు రెండు సంవత్సరాలుగా కార్మికులు, ప్రజలు పోరాడుతున్న విశాఖపట్నంకి ప్రధాని రావడం ఆంధ్ర ప్రజలను అగౌరవపరచడమేనని అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ కేంద్రప్రభుత్వ పరిశీలనలో లేదని చెప్పి ఆంధ్రాలో ప్రధాని పర్యటించడం తెలుగువారి ఆత్మ అభిమానాన్ని దెబ్బతీయటమేనని అన్నారు. రాయలసీమకు ద్రోహం చేసిన బిజెపిని నేడు రాష్ట్రంలో ఉన్న అధికార భాగస్వామి పక్షాలు సమర్పించడం దుర్మార్గమన్నారు. బిజెపి గతంలో రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించి ఇప్పుడు తమకు సంబంధం లేదని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామంటూ 9 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలను నమ్మించి బిజెపి ద్రోహం చేసిందన్నారు. పది సంవత్సరాలుగా రాష్ట్ర హోదాపై పూటకో మాట మార్చి ఆంధ్రప్రజలను నట్టేట ముంచింది. రాష్ట్రంలోని ఓడరేవులు, రోడ్లు, రైల్వే లైన్లు అదాని కంపెనీకి అప్పగిస్తుందని, సోలార్, గాలిమరలు, విద్యుత్ ఉత్పత్తి పేరుతో రాయలసీమలోని వేల ఎకరాల భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తుంది. ఇన్ని రకాలుగా ఆంధ్ర ప్రజలను దగాచేస్తున్న బిజెపిని నిలదీయాల్సిన టిడిపి జనసేన వారిసేవలో తరిస్తున్నాయని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండి కూడా కేంద్రం చేస్తున్న అన్యాయంపై ఒక మాట మాట్లాడలేదని స్థితిలో వైసిపి ఉందన్నారు. అందుకే సిపిఎం రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రాన్ని నిలదీస్తున్నదని, బిజెపి చేస్తున్న అన్యాయాలపై పోరాడుతుందని ప్రజలందరూ కూడా బిజెపి విధానాలను రాష్ట్రప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మతోన్మాద బిజెపి పాలనకు వ్యతిరేకంగా భవిష్యత్తులో చేసే పోరాటాలకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా నాయకులు ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, అర్జున్, చిలకమ్మ, సంజయ్, రాజా జయంతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సరెండర్ లీవుల

బకాయిలు వెంటనే ఇవ్వాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, చిత్తూరు టౌన్

ప్రజలకు రక్షణ కల్పిస్తూ ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ కార్యక్రమాలకు అన్ని రకాలుగా సేవలందిస్తున్న పోలీసులకు బకాయి ఉన్న అన్ని రకాల బిల్లులు వెంటనే ఇవ్వాలని మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ అన్ని రకాలుగా ప్రజలకు రక్షణ కల్పిస్తున్న పోలీసులు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. సంవత్సరాల కొద్దీ వారికి టీఏ, డీఏలు బిల్లులు, సరెండర్ లీవులు డబ్బులు బకాయిలు ఉంటే వారి కుటుంబాల పరిస్థితి ఏంటని అన్నారు. పిల్లలకు ఫీజులు కట్టడం, ఇళ్ల బాడుగులు, నిత్యావసరాలు వంటి సమస్యలతో పోలీసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం నుంచి ప్రస్తుత ప్రభుత్వం వరకు నిర్వహించిన అన్ని కార్యక్రమాల్లో రకాల సేవలు అందిస్తున్న పోలీసుల పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. వారు ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడలేని పరిస్థితి ఉన్నారని, ప్రభుత్వాలు కూడా చిత్తశుద్ధితో ఆలోచించి సంవత్సరాలకు కొద్ది బకాయి ఉన్న సరెండర్ లీవుల డబ్బులు, టిఎ, డిఎల్ డబ్బులు ఇతర అలవెన్సులు వెంటనే ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకులు ఓబుల్ రాజు, గిరిధర గుప్తా, భువనేశ్వరి, అర్జున్, రాజా, సంజయ్, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంఘమిత్రలపై రాజకీయకక్షలేలా..!

జిల్లాలో 270 మంది తొలగింపు

ద్వాక్రా సంఘాల ఏర్పాటు తమ ప్రభుత్వం చేసింది.. మహిళలను మహారాణులను చేస్తాం.... స్వయం సహాయ సంఘాల్లోని మహిళలకు ఆర్థిక చేయూతను అందిస్తామంటున్న ప్రభుత్వం ఆ పార్టీకి పని చేశారు.. ఈ పార్టీకి పని చేశారంటూ సంఘమిత్రలపై ప్రతాపం చూపుతోంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సభలు, సమావేశాలకు జనాన్ని తీసుకురావాలంటూ సంఘమిత్రలకు హుకుం జారీచేయడం పరిపాటిగా మారిపోయింది.



సంఘమిత్రల తొలగింపుపై కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సంఘమిత్రలు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎక్కడ ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినా పెద్దసంఖ్యలో కనిపించేంది స్వయం సహాయ సంఘాల మహిళలే.. చేప్పేది వాళ్ళే.. తొలగించేది వాళ్ళే.. మధ్యలో సంఘమిత్రలు (వీఓఏ) రాజకీయ నేతల ఆగ్రహానికి బలైపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తరువాత జిల్లాలో దాదాపు 270 మందిని రాజకీయ కక్షలతో తొలగించారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సంఘమిత్రలను తొలగించాలని సంబంధిత స్వయం సహాయ సంఘాల గ్రామ సమావేశం తీర్మాణం తప్పనిసరిగా ఉండాలి. ఎలాంటి నిబంధనలు పాటించకుండా స్థానిక నేతలు తొలగించేస్తున్నట్లు ప్రకటిస్తూ ఇబ్బందులకు గురి చేసున్నారని సంఘమిత్ర సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తే ప్రత్యేక్ష ఆందోళనకు పూనుకోవడంతో పాటు అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామంటున్నారు. ఇలా తొలగించడం చల్లదంటూ ఇప్పటికే జిల్లాలో తొలగించిన సంఘమిత్రలు కోర్టును ఆశ్రయించారు.

జిల్లాలో 1,142 మంది సంఘమిత్రలు స్వయం సహాయ సంఘాల మహిళలకు సేవలందిస్తున్నారు. డ్వాక్రా సంఘాలకు, మండల సమాఖ్యలకు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. సంఘాలను ఏర్పాటు చేయడం నుండీ బ్యాంకు రుణాలు మంజూరు, ఆర్థిక లావాదేవీల విషయంలో సంఘమిత్రల పాత్ర కీలకం. బ్యాంకు రుణాలు పొందిన వారు తిరిగీ చెల్లించకుండా చెల్లించేలా చేస్తున్నారు. శ్రీనిధి ద్వారా ఇచ్చే రుణాలు వసూలు చేసి మండల సమాఖ్యలకు జమ చేస్తున్నారు. గ్రామసభల నిర్వహణ, సంఘాల్లో ఆర్థిక లావాదేవీల నిర్వహణ నేర్పుతున్నారు. ఇంతటి కష్టం చేస్తున్న సంఘమిత్రలకు నెలకు ఇచ్చేది రూ.8వేలే, పుస్తకాల నిర్వహనకు రూ. 2వేలు మొత్తం రూ.10వేలు అయినప్పటికీ సాటి మహిళలకు సాయం చేయాలనే ఉద్దేశంతో తక్కువ జాతానికి పనిచేస్తున్న వీరిపై రాజకీయ కక్షలతో తొలగించడాన్ని డ్వాక్రా మహిళలు సైతం ఇదేక్కడి న్యాయమా అంటూ ప్రశ్నిస్తున్నారు. అక్రమంగా తొలగిస్తున్న సంఘమిత్రలకు మద్దతుగా జిల్లాలోని అనేక మండలాల్లో డ్వాక్రా మహిళలు ఆందోళనలు చేస్తున్నారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో పనిగట్టుకొని కొందరు సంఘమిత్రలను తొలగించి ఆస్థానంలో స్థానిక నేతల బంధువులు అధికార పార్టీకి చెందిన వారికి కట్టబెడుతున్నారు. రాజకీయ కక్షలకు పూనుకోమని వ్యవస్థను కాపాడుతామని చెబుతున్న కూటమి ప్రభుత్వం, ఆ పార్టీల్లో నేతలు చిరుద్యోగులైన సంఘమిత్రపై రాజకీయ కక్షలు మానుకోవాలని సంఘమిత్ర సంఘం నేతలు, సంఘమిత్రలు కోరుతున్నారు.

రాజకీయ కక్షలతో తొలగిస్తే ఊరుకోం..

- రాజశేఖర్, సంఘమిత్ర సంఘం జిల్లా అధ్యక్షులు

రాజకీయ కక్షలతో సంఘమిత్రలను తొలగిస్తే ఊరుకొనేది లేదు. జిల్లాలో తొలగించిన సంఘమిత్రలను తిరిగీ పనిలో పెట్టుకొనేలా ఉద్యమాలు చేయడంతో పాటు కోర్టును ఆశ్రయిస్తాం. అనేక సంవత్సరాలుగా తక్కువ జీతంతో పనిచేస్తున్న వారిని తొలగించం అత్యంత దారుణం. మూడు రోజుల పాటు జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తున్న సంఘమిత్ర విషయంపై స్పందించాలి.

కానిస్టేబుళ్ళ ఎంపికలో 192 మందికి అర్హత



కానిస్టేబుల్ ఉద్యోగం కోసం పరుగులు పెడుతున్న అభ్యర్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏడవ రోజు స్థానిక పోలీసు శిక్షణా కేంద్రంలో ఇంఛార్జి ఎస్పీ రత్న కానిస్టేబుళ్ళ ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. స్టైఫండరీ కేడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు చిత్తూరు జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ మైదానంలో ఏడవ రోజు కూడా పకడ్బందీగా కొనసాగాయి. ఏడవ రోజు 610 మంది అభ్యర్థులకు గాను 379 మంది హాజరు. వీరిలో 192 మంది తదుపరి రాత పరీక్షకు అర్హత సాధించారు. కానిస్టేబుల్‌ల ఎంపిక ప్రక్రియలో ఏడవ రోజు అభ్యర్థులకు పరీక్షల నిర్వహణకు కానిస్టేబుల్‌ల ఎంపిక ప్రక్రియ ఇంచార్జ్ ఎస్పీ వి.రత్న అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. హాజరైన 379 మందికి సర్టిఫికెట్ల పరిశీలన, ఫిజికల్ మెజర్మెంట్‌లో భాగంగా ఎత్తు, ఛాతీ కొలిచారు. అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు నిర్వహించగా 192మంది తదుపరి ప్రక్రియకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు ఆదేశాలు, నియమ నిబంధనలు మేరకు ఈ పరీక్షలు పటిష్టంగా జరిపించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలు బయోమెట్రిక్ అథెంటికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు, ఆర్‌ఎఫ్ ఐడి ట్యాగుల పంపిణీ, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు (1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్) రిజల్ట్ కౌంటర్ వరకు కేటాయించిన విధులను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించారు. ఇక పరుగు పందెంలో అలసిన అభ్యర్థులకు వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. భర్తీప్రక్రియ పారదర్శకంగా పూర్తిగా అభ్యర్థుల ప్రతిభ పాటవల ఆధారంగానే జరుగుతుందని కావున అభ్యర్థులు, తల్లితండ్రులు దళారులను మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా ఉండాలని సూచించారు. మోసం చేయాలని ప్రయత్నిస్తే డయల్ 100 లేదా 94409 00005 ఫిర్యాదు చేయాలని కోరారు.

నేడు డైట్‌లో జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు

ప్రజాశక్తి- కార్వేటినగరం : జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో ఈ 8న జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ తెలిపారు. సోమవారం డైట్ కళాశాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిత్తూరు-తిరుపతి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ అలాగే ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు, కళాశాలలో 6 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. జిల్లాస్థాయి రంగోత్సవ్ 2024-25 పోటీలలో 8 విభాగాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి విభాగంలోను జిల్లా స్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వారు ఈ నెల చివరి వారంలో రాష్ట్రస్థాయిలో జరిగే రంగోత్సవ్ పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధిస్తారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. రంగోత్సవ్ పోటీలో పాల్గొనేవారు ఏదైనా ఒక అంశంలో మారతమే పోటీ చేసుకోవాల్సి ఉంటుందని, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే వారందరికి పార్టిసిపేషన్ సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారికి ఉచిత బస్సు సౌర్యంతో పాటు, భోజన వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. తంగోత్సవ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ అలాగే పంజాబ్ రాష్ట్రాలపై క్విజ్ పోటీలు భారతీయ స్వాతంత్ర్య పోరాటయోదుల చిత్రాలపై లేఖన పోటీ, తెలుగు, ఇంగ్లీషలలో అందమైన చేతిరాత పోటీ, రంగోలీ పోటీ, ఆంధ్రప్రదేశ్ పంజాబ్ జానపద, నృత్య పోటీ భిన్నత్వంలో ఏకత్వంపై డిజిటల్ పోస్టర్ పోటీ, ఏక్భారత్ శ్రేష్ఠ భారత్ అంశంపై నినాదాల రచనపోటీ, రోల్ ప్లే (నాటకీకరణ) పోటీలు ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఇతర వివరాల కోసం పాఠశాల యాజమాన్యం ద్వారా శ్రీనివాసులురెడ్డి 93475 61448 నంబరును సంప్రదించాలన్నారు.

కులగణన గడువు

12 వరకు పెంపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును జనవరి 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు చిత్తూరు జిల్లా కలెక్టరు తెలిపారు. జనవరి 7వ తేదీతో గడువు ముగియనుండటంతో మరొక 5 రోజులు అనగా జనవరి 12వ తేదీ వరకు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని, విధివిధానాలు తెలుపుతూ ప్రభుత్వం 265 నంబరు జీవో విడుదల చేసినట్లు జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జనవరి 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం అన్ని తనిఖీలు పూర్తిచేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20వ తేదీన వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు.

తాగి వాహనం నడిపే ముందు

ఆలోచించండి

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి పదివేలు చొప్పున లక్ష జరిమానా విధించినట్లు ట్రాపిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు. సోమవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 10 మంది పట్టుబడ్డారని, వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా జడ్జ్ ఉమాదేవి వాహనదారులకు 10 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం లక్షరూపాయలు జరిమానా విధించారని తెలిపారు. ఈ 12 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 677 మందికి సుమారు 67.7 లక్షల రూపాయలు కోర్టు ద్వారా జరిమానా విధించారన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరం, ఇది మీ ప్రాణాలకు, ఇతరుల ప్రాణాలకు ముప్పు ఏర్పాడుతుందని, జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు.

కేంద్ర కరువు నిర్ధారణ కమిటీ క్షేత్రస్థాయి పర్యటన

ప్రజాశక్తి- యాదమరి: కేంద్ర కరువు నిర్ధారణ కమిటీ సభ్యులు బుధవారం మండలంకు రానున్నారని మండల వ్యవసాయ అధికారి చరిత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని 16 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందని, కేంద్ర కరువు నిర్ధారణ కమిటీ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా యాదమరి మండలం పరిధిలోని కోనపల్లి రెవెన్యూ గ్రామంలో ఉదయం 10 గంటలకు పర్యటించనున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో మండలంలో పంటనష్టం వివరాలు, రైతులతో ముఖాముఖి, పంటనష్ట పరిహారా అంచనాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించనున్నారని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన సంఘం డైరెక్టర్లు



ప్రజాశక్తి- రొంపిచర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ వెల్ఫేర్, టెక్స్టైల్స్ శాఖ మంత్రి సవితమ్మను రాష్ట్ర కురుబ సంస్థ డైరెక్టర్లు ఉయ్యాల రమణ, వల్లిగట్ల వెంకటరమణ, సుబ్రహ్మణ్యం గౌడ్ మంత్రి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బీసీల ఎదుగుదల కోసం సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. వీరి వెంట నాయకులు కిరణ్ కుమార్, శశి ఉన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోండి

డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం



ప్రజాశక్తి- ఎస్ ఆర్ పురం: ఇంటి వద్ద బెడ్ కే పరిమితమై లేచి నిలబడలేని స్థితిలో ఉన్న పేషెంట్లకు వైద్యం అందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మకమైన అరబిందో అత్యవసర సేవలు 104 వైద్యసేవలు గ్రామీణ ప్రాంతంలో ప్రజలు ఉపయోగించుకోవాలని మరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని కటికపల్లి గ్రామపంచాయతీ కటికపల్లి గ్రామంలో ఇంట్లోనే బెడ్లకు పరిమితమైన పేషెంట్లకు ఇంటి వద్దకు వెళ్లి వైద్యం అందించారు. అనంతరం జలుబు, జ్వరం ఉన్న రోగులకు, బిపి, షుగర్ వంటి అన్ని రకాల జబ్బులకు వైద్యసేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వాణి, ఎంఎల్‌హెచ్‌పి ఈశ్వరి, హెచ్ఏఎన్ రామ్మోహన్, 104 గోపీనాథ్ రెడ్డి, పైలెట్ గిరి, ఆశాలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దూడలకు టీకాలు తప్పనిసరి: ఏడీ



లేగదూడలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు గ్రామంలో మంగళవారం పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ అధికారి రూప మాట్లాడుతూ ప్రస్తుతం జనవరి నెలలో పశువులకు ముద్ద చర్మవ్యాధులు వస్తున్నాయని, ఇవి సహజంగా గాలి ద్వారా వ్యాప్తి చెందుతాయని, రైతులు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. పశువు శరీరంపై బొబ్బలు కనిపించిన వెంటనే ఆ పశువును పాక నుంచి వేరుచేసి చికిత్స అందిస్తే కోలుకుంటుందని తెలిపారు. అలాగే పశువుల కొట్టంలో సున్నం, బ్లీచింగ్ పౌడర్‌ను షెడ్డు చుట్టూ, లోపల పిచికారి చేయాలని లేకపోతే ఉప్పు నీళ్లలో మిక్స్ చేసి పిచికారీ చేసినా కూడా సరిపోతుందని తెలియజేశారు. ఎక్కువగా లేగ దూడల పైన ఈ వ్యాధి ప్రభావం ఉంటుందని ఆమె తెలిపారు. ముందస్తుగా పశువులకు ఈ వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నట్లు ఆమె మీడియాతో తెలిపారు. పచ్చికాపల్లం వైద్యాధికారి రాజేష్, విజయలక్ష్మి, సిబ్బంది వెంకటముని, పాడి రైతులు పాల్గొన్నారు.

18-20 తేదీల్లో 'ఫ్లెమింగో ఫెస్టివల్'

రాష్ట్రపండుగలా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - దొరవారిసత్రం, తడ

సూళ్లూరుపేట నియోజకవర్గం నేలపట్టులో ఈనెల 18-20 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర పండుగలా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎంఎల్ఎ నెలవల విజయశ్రీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇరువురూ దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులు అందరూ సమిష్టిగా పనిచేసి వైభవంగా ఫెస్టివల్‌ను మూడు రోజుల పాటు నిర్వహించాలన్నారు. పక్షుల కేంద్రంలో మ్యూజియం, చెట్లపై విడిది చేసి పొదిగి ఉన్న సంతానోత్పత్తి పక్షుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ డిఎఫ్ఒ, టూరిజం శాఖ ఆర్‌డిఇడి రమణకుమార్, డిడిటిఒ జనార్ధన్‌రెడ్డి, డిఎంఒ శ్రీనివాసులు, ఇఇ సుబ్రమణ్యం, తహశీల్దార్ శైలకుమారి, డిఎస్‌పి చెంచుబాబు, సిఐ సంగమేశ్వరరావు, టిడిపి మండలాధ్యక్షులు వేమసాని శ్రీనివాసునాయుడు పాల్గొన్నారు.

తడ మండలం భీమునివారిపాలెంలో పడవల రేవును పరిశీలించారు. స్థానిక నాయకులు పులికాట్ సరస్సు పూడికతీత గురించి అడిగారు. భీమునివారిపాలెంలో రోడ్డు సరిగ్గా లేదని, డ్రైనేజీ వ్యవస్థ లేదని కలెక్టర్ దృష్టికి స్థానికులు తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్ లోపే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



ప్రజాశక్తి- యాదమరి: అంటువ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశ డే నెలవారి సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ సురేఖ సూచించారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల నెలవారి సమావేశం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి హాజరైన వైద్యాధికారి డాక్టర్ కొత్తగా హెచ్ఎంపివి వైరస్ వల్ల కేసులు నమోదు అవుతున్నాయని, ఈ వైరస్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 2019వ సంవత్సరంలో చైనాలో ప్రారంభమై ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా వైరస్ లాంటి ప్రాణాంతకమైన వైరస్ ఇది కాదన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ సురేఖ సిబ్బందిని ఆదేశించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ హెచ్ ఎంపివి వైరస్ చిన్నపిల్లలకు, 60 సంవత్సరాల పైబడ్డ వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు త్వరితగతిన సోకే అవకాశం ఉందన్నారు. దగ్గు, జలుబు, శ్వాసకోస సంబంధమైన ఇబ్బందులు ఈ వ్యాధి లక్షణాలన్నారు మాస్కులు ధరించడం, చేతులు శుభ్రం చేసుకోవడం, వ్యక్తికి వ్యక్తికి మధ్య పాటించడం వలన ఒకరి నుండి ఇంకొకరికి వ్యాధి సోకకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: పచ్చికాపలంలో మంగళవారం ఆశడే సందర్భంగా వైద్యాధికారి లేనందున సూపర్వైజర్లు ఈశ్వరమ్మ, మురళీమోహన్, కృష్ణారెడ్డికి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గీత ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఆశాలకు వేతనాలు పెంచాలని ఉద్యోగానికి భద్రత కల్పించాలని, ఆశాల సమస్యలన్నింటినీ పరిశీలించి పరిష్కరించాలని కోరారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని ఆశా వర్కర్లకు బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజల అంటు వ్యాధుల నివారణ, ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని డాక్టర్ విజయ్ చందర్ సూచించారు. అలాగే వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత, శ్వాసకోశ వ్యాధులు నివారణ, తల్లిపాలు అనుబంధ ఆహారం ప్రాధాన్యత, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



గంగాధర నెల్లూరు: మండల ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో మంగళవారం ఆశాడే సమావేశం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ దుర్గాదేవి మాట్లాడుతూ టీబీ వ్యాధిపై అవగాహన ప్రజలకు కల్పించాలన్నారు. శ్వాసకోస వ్యాధిపై, గ్రామాల్లో పరిశుభ్రతంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇటీవల వర్షాలు, మంచు కురవడం వల్ల వాతావరణం మార్పు రావడంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఏదైనా అనారోగ్య సమస్యలు ఉంటే ప్రజలు సంబంధిత ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సిహెచ్ఓ శ్రీనివాసులు, వైద్యసిబ్బంది దీప, శైల, ధర్మేంద్ర, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి అథ్లెటిక్స్ క్రీడలు ప్రారంభం



ప్రజాశక్తి- చౌడేపల్లి: మండలంలోని పుదిపట్ల ఉన్నత పాఠశాల పరిధిలో నియోజకవర్గస్థాయి అథ్లెటిక్స్ క్రీడలను మండల విద్యాశాఖ అధికారులు కేశవరెడ్డి, తిరుమలమ్మలు ప్రారంభించారు. నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన 400 మంది విద్యార్థులు అథ్లెటిక్స్ క్రీడల్లో పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ క్రీడల్లో ఈనెల 8న ఫైనల్స్ ఉంటాయని నిర్వాహకులు బాబు రెడ్డి తెలిపారు. తిరుమనపల్లి, పుదీపట్ల, బాబురెడ్డి, వినోద్ కుమార్‌రెడ్డి కార్యక్రమంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మజ, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, సీనియర్ విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయుడు రామచంద్ర, వెంకటేష్, కరుణాకర్, చిన్నప్ప, రాజేంద్ర, నితిన్, ఉమాశారద, నీలవేణి, మృదుల పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లి పంచాయతీ రెడ్డిపల్లి గ్రామనికి చెందిన టిడిపి నాయకుడు బాలాజీ నాయుడు అత్త గుత్త ప్రమీలమ్మ సోమవారం గుండెపోటుతో మృతి చెందింది. మంగళవారళం ఆమె మృతదేహానికి వెదురుకుప్పం క్లస్టర్ ఇంచార్జి టిడిపి మాజీ మండల అధ్యక్షులు మోహన్ మురళి స్థానిక నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఓదార్చి పరామర్శించారు. నాయకులు రావిళ్ళ దేవరాజులు నాయుడు, వరప్రసాద్, వెంకటాద్రి నాయుడు, చిరంజీవి నాయుడు, మొగిలయ్య, మనోహర్ నాయుడు నివాళి అర్పించారు.

భక్తులకు అన్నదానం



ప్రజాశక్తి- రొంపిచర్ల: మదనపల్లి, రాయచోటి ప్రాంతాల నుంచి తిరుమలకు పాదయాత్ర ద్వారా వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని నడిచి వెళ్లే భక్తులకు పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సూచన మేరకు రొంపిచర్ల మండలం పెద్దగొట్టిగల్లు శివాలయం వద్ద సుమారు 1000 మందికి స్థానిక టిడిపి నాయకులు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చే భక్తులకు మందులు, మాత్రలు, పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర బీసీ సంఘం డైరెక్టర్ ఉయ్యాల రమణ, నాయకులు సి.ఓబులేశ్వర్ రెడ్డి, ఊటుకూరి మదన్‌మోహన్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, విజయ్ కుమార్, మదన్ మోహన్, వీర, శ్రీరామ్ రెడ్డి, ఖాదరవల్లి, ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు గురజాడ

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు గురజాడ అప్పారావు అని చర్మవ్యాధుల నిపుణులు, సినీ నిర్మాత అయిన డాక్టర్ యుగంధర్ అన్నారు. తిరుపతిలోని టంగుటూరి ప్రకాశం పంతులు ఉన్నత పాఠశాల నందు మంగళవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు అని కొనియాడారు. గురుజాడ అప్పారావు గొప్ప వ్యక్తిత్వాన్ని వివరించారు. అలాగే పిల్లలు ఏ విధంగా శుభ్రతగా ఉంటే చర్మ వ్యాధులు రావో వివరించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలని, అలాగే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని, శుభ్రతను తప్పకుండా పాటించాలని తెలియజేశారు. టిపిపిఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆనంద్ పాల్గొన్నారు.

ఉపయోగం లేని వాటర్ ట్యాంకులు

- ఆగిన పనులు
- పూర్తి చేయని కాంట్రాక్టర్లు
- తాగునీటి ఇబ్బందుల్లోనే గ్రామస్తులు

ప్రజాశక్తి- సదుం: మండల పరిధిలో గత ప్రభుత్వం సుమారుగా 70 మంచి నీటి ట్యాంకులు గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు లక్షల వ్యయంతో నిర్మించారు. అలాగే అమ్మగారిపల్లి గ్రామపంచాయతీ గుండ్లూరు వారిపల్లి దళితవాడలో తాగునీరు ట్యాంక్‌ను లక్షలు ఖర్చుపెట్టి నిర్మించారు. అయితే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలోపు సాధారణ, లోకసభ ఎన్నికలు రావడంతో కాంట్రాక్టర్లు వాటర్ ట్యాంక్ పనిని అర్ధాంతరంగా ముగించి వెళ్లిపోయారు. పనులు పూర్తి చేయకుండా ట్యాంక్ నిర్మాణానికి ఏర్పాటు చేసిన సపోర్ట్ కొయ్యలను కూడా తీయకుండా అలానే వదిలేసి వెళ్లి పోవడం గమనార్హం. అంతేకాకుండా ట్యాంకు పైకి వెళ్లడానికి మెట్లు, నీటిని సరఫరా చేయడానికి పైపులైన్లు సైతం చేయకుండా అలానే వదిలేశారు. దీంతో దళితవాడలోని ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిర్మాణ పనులు ఆగి ఉపయోగంలో లేని వాటర్ ట్యాంకుల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు తాగునీటి అవస్థలు లేకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంకు

పుంగనూరు జోనల్ గేమ్స్‌లో సోమల విద్యార్థిని ప్రతిభ



ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న సోమల విద్యార్థిని వసుంధర

ప్రజాశక్తి- సోమల: చిత్తూరు జిల్లా పుంగనూరు జోనల్ గేమ్స్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమల విద్యార్థిని జూనియర్ బాలికల అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి పుంగనూరు జోన్‌లో ప్రథమ స్థానం సాధించినట్టు వ్యాయామ ఉపాధ్యాయులు కరుణానిధి తెలిపారు. మంగళవారం 7వతేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పుదిపట్లలో పుంగనూరు జోన్ పాఠశాలల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పుంగనూరు జోన్ పరిధిలోని వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొనగా హోరాహోరీగా జరిగిన పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమల విద్యార్థిని యం.వసుంధర 8వ తరగతి ప్రతిభ కనబరిచి జూనియర్ బాలికల 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని పీడీ తెలిపారు. ఈ విజయం పట్ల ప్రధానోపాధ్యాయులు హరినాథ్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసి క్రీడాకారుల్ని అభినందించారు.

హెచ్‌ఎంపివి వైరస్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సిఎం పర్యటనలో ఉన్న డిఎంఅండ్‌హెచ్‌ఒ మంగళవారం కుప్పం నుండి హెచ్‌ఎంపీవీ వైరస్‌పై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటా న్యూమో వైరస్) వైరస్ గురించి పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. దీని లక్షణాలు పూర్తిగా కోవిడ్ 19 లక్షణాలే ఉంటాయని, జ్వరం, దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి, శ్వాస పీల్చుకోవడం ఇబ్బంది, ఆస్మా వంటివి కనిపిస్తాయన్నారు. వైరస్ ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారి తీయవచ్చు అని, ఇన్ఫెక్షన్ సోకిన 3 నుంచి 5 రోజుల లోపల లక్షణాలు బయటపడతాయని తెలిపారు. ఇది చంటి బిడ్డలు, వయస్సు పైబడినవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఎక్కువ ఇబ్బంది కలిగించే అవకాశం ఉందని, ఇది జబ్బు ఉన్న వ్యక్తి తుమ్మినప్పుడు తగ్గినప్పుడు తుంపర్లు గాలిలో కలిసి ఆరోగ్యవంతులు పీల్చినప్పుడు వస్తుందన్నారు. వైరస్ భారినపడిన సన్నిహితులను కలవడం వారిని తాకి చేతులు ముక్కు కంటి వద్ద తాకడంతో వస్తుందన్నారు. ముందస్తు నివారణకు చేతులను అప్పుడప్పుడు సబ్బుతో 20సెకండ్ల పాటు కడగాలని, చేతులను శుభ్రం చేసుకోకుండా ముక్కు, నోరు, కంటిని తాకరాదని, బహిరంగ ప్రదేశాలకు వెళ్ళినప్పుడు తప్పక మాస్క్ ధరించాలని సూచించారు. వైరస్ బారిన పడితే బయట తిరగవద్దు అని, సన్నిహితులను కలిసినప్పుడు నమస్కారం చేయండి, హ్యాండ్ సేక్ ఇవ్వద్దు అని, తాజా ఆరోగ్యకర ఆహార పదార్థాలను తీసుకోండి పై సూచనలు తప్పక ప్రజలు పాటించేటట్లు విఫలంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎం అండ్‌హెచ్‌ఒ

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్



ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: భూ సమస్యలను పరిష్కరించడం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని ప్రతి గ్రామానికి రెవెన్యూ అధికారులు వచ్చి సదస్సు నిర్వహిస్తారని భూములకు సంబంధించి సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావాలని డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్ అన్నారు. మంగళవారం డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో కొత్తపల్లిమిట్ట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. సర్వేయర్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: రైతుల వద్దకే రెవెన్యూ సదస్సులు చేపడుతున్నట్టు రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని వేపనపల్లి కల్లూరుపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులకు గ్రామాల్లోని భూసమస్య పరిష్కరించేందుకు రెవెన్యూ గ్రామసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమస్యలు ఉన్నవారు గ్రామసభలో విన్నవించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఆర్ఐ మధుసూదన్, మండల సర్వే లావణ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




గంగాధర నెల్లూరు: భూసమస్యలు పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం గంగాధర నెల్లూరు గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు జరిగింది. వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, మండల ప్రధాన కార్యదర్శి జ్యోతి రెడ్డి, ఆర్ఐ ఏకాంబరం, విఆర్ఓలు రూహి ఫాతిమా, రవి, సర్వేయర్ వాసు పాల్గొన్నారు.



క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో అర్చకుడు మృతి



మృతుడు కళ్యాణ్ గౌతమ్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి గ్రామంలో బైరెడ్డి వంశీకులు నిర్మించిన శ్రీకోదండ రామస్వామి, శ్రీ శేషాద్రిస్వామి, శ్రీ ఓబులేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య అర్చకులు తిప్పాచార్యులు కుమారుడు అర్చకులు కళ్యాణ్ గౌతమ్ (22) సోమవారం రాత్రి కర్ణాటక రాష్ట్రం కోలారు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు టిటిడి వేద పాఠశాలలో విద్యను అభ్యసించి ఇటీవల గ్రామంకు వచ్చాడు. తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటా పూజలు నిర్వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో పూజలు ముగించుకొని స్వగ్రామంకు వస్తున్న సమయంలో రోడ్డుప్రమాదంలో కళ్యాణ్ మరణించారు. మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకురావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మాజీ సర్పంచ్ జైకుమార్, డాక్టర్ ఐరాల కృష్ణవేణి, ఎక్స్ జెడ్పిటిసి రాధాకిషోర్, దామోదర్, పలువురు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

ఆయిల్ ఫామ్ సాగు.. రైతులకు ఓ వరం

అమ్మ ఫాక్స్ సీఈవో రంగనాయకులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ఆయిల్ ఫామ్ తోటల సాగు రైతులకు వరమని ఆయిల్ ఫామ్ అమ్మ ఆయిల్ సీఈవో రంగనాయకులు మంగళవారం మండలంలోని నెల వాయి రైతు భరోసా కేంద్రంలో ఆయిల్ ఫామ్ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మండలంను అమ్మ ఆయిల్ ఫామ్‌కు మంజూరు చేసిందని అమ్మ ఫామ్ ద్వారా రైతులకు ఉచితంగా మొక్కలు అందజేస్తామని సలహాలు సూచనలు ఇస్తామని అన్నారు. ఆయిల్ ఫామ్ సాగు విధానం, సస్యరక్షణ మిగతా పంటలతో పోలిస్తే వచ్చే దిగుబడులు గురించి గతంలో ఆయిల్ ఫామ్ సాగు చేసిన రైతులు గురించి స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. కోకో, అరటి, బొప్పాయి, వక్క, మిరియాలు, పైనాపిల్ అంతర్ పంటలుగా సాగు చేయొచ్చని, సమీకృత వ్యవసాయంతో తక్కువ పొలంలో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని రైతులకు తెలియజేశారు. డిస్ప్లే ద్వారా రైతులకు చూపించారు. రైతుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గంగాధర్ నెల్లూరు ఉద్యానవన శాఖ అధికారి లోకేష్, అమ్మ ఆయిల్ ఫామ్స్ ప్రతినిధి మహేష్, ఆయిల్ ఫామ్ రైతు రఘుపతి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

మంగళ విద్యావాణి మాసపత్రిక ఆవిష్కరణ



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఉపాధ్యాయుల మేధస్సును విద్యార్థులు ఉపయోగించుకోవాలని విశ్రాంతి చిత్తూరు ఉప విద్యాశాఖ అధికారి వాసుదేవ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ విద్యావాణి 32వ మాసపత్రికను ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మంగళపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులచే నడుపబడుతున్న పాఠశాల సంచిక మంగళ విద్యావాణి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఇందుకు ఆర్థిక సహాయం అందించిన నలగాంపల్లెకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ధరణి ప్రసాద్ అభినందనలు తెలిపారు. గణిత దినోత్సవం సందర్భంగా తీసుకొచ్చిన ఈ సంచిక గణిత విషయాలతో నిండి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పాఠశాలలోని గొప్ప ఉపాధ్యాయ బృందమేధస్సును విద్యార్థులందరూ ఉపయోగించుకుని గొప్పవారు కావాలన్నారు. చిత్తూరులో జరిగిన మ్యాథ్స్ ఫోరం సదస్సులో 9వ తరగతి విద్యార్థిని లహరి, గణిత ఉపాధ్యాయులు అరుణ శివప్రసాద్ మార్గదర్శకత్వంలో విద్యార్థిని ప్రతిభకు మెచ్చి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ విద్యార్థికి నగదు బహుమతిని అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం లహరి తల్లిదండ్రులను సత్కరించి, నగదు బహుమతిని అందజేశారు. ఉపాధ్యాయులు భారతి, రమాదేవి సంజీవి, పిళ్ళారప్ప, సంపంగి, ప్రేమ కృష్ణ, ధనశేఖర్, మోహన్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై శిక్షణ

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం : మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలుపుతూ జిల్లాస్థాయి అధికారులు ఆదేశాల మేరకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో మోహన్ మురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మాత గాంధీ ఉపాధి హామీ పథకం కింద అదనంగా కూలీలకు అధికంగా పని దినాలు కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మండలంలో 23 పంచాయతీలకు గ్రామసభను నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలో ప్రత్యేక అధికారి గుర్తించిన పనులను ప్రత్యేక అధికారులు ఖరీఫ్ 2024-25 వేతనాలను కోరుకునే వారికి ఫారం పాండు, అమృత్ సరోవర్, స్టాగర్ ట్రెంచ్లు, ఇంటర్నల్ ట్రెంచ్లు, రింగ్ ట్రెంచ్లు, రైన్ హార్విస్టింగ్ స్ట్రక్చర్స్ పనులను భూగర్భ జలాల రీఛార్జ్ చేసే నిర్మాణాలు, పశువుల మేత పనులు, ప్లాంటేషన్ హార్టికల్చర్ పనులను మండలంలోని ఉపాధి హామీ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏపీవో చంద్రశేఖర్ టీఏలు రామ్మూర్తి, రేఖ, నవసేద్ బాలన్, నోమేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి పనులు గురించి వివరిస్తున్న ఎంపిడిఓ మోహన్‌మురళీ